క్లుప్తంగా

కిడ్నీ వ్యాధి బారిన పడకుండా చర్యలు చేపట్టాలి

నేరడిగొండ: మండలంలోని గుత్పాల గ్రామస్తులు ఏళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కలీమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అనేక మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, అధికారులు గ్రామాన్ని సందర్శించి వ్యాధికి గల కారణాలు తెలుసుకోవాలన్నారు. సభ్యులు బి.దాసు, రమణ, సత్యనారాయణ, అమృత్ కుమార్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక అన్నారు. నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వడూర్, వెంకటాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ కోసం గ్రామస్తులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వంశపారంపర్యంగా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, సూపర్‌వైజర్ సంతోష్, గంగామణి, శ్యామల పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపురకు చెందిన తోట లింగన్న అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అందజేశారు. శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి రూ.60 వేల చెక్కును అందజేసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జహీర్ రంజాని, బండారి సతీష్, ప్రశాంత్, ఖీజర్ పాషా, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, అఫ్రోజ్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని దస్నాపూర్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్ల మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మావల ఏఈ జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధోబికాలనీ, రాంనగర్, కేఆర్‌కే కాలనీ, సాయినగర్, ఖోజా కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: సంక్రాంతి పండుగ సందర్భంగా బోథ్ మార్కెట్ పరిధిలోని బోథ్, పొచ్చెర, సొనాల, నేరడిగొండ సీసీఐ కేంద్రాల్లో ఈనెల 12 నుంచి 15 వరకు పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 16న కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. రైతులు గమనించి సహకరించాలన్నారు.

అటవీ అధికారులను అడ్డుకున్న వ్యక్తుల రిమాండ్

ఇచ్చోడ: ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఇటీవల అటవీశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో గ్రామస్తులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతవరణం నెలకొంది.ఈ సంఘటనలో అటవీశాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన షేక్ జనున్,షేక్ కరీం అనే వ్యక్తులకు బోథ్ మున్సిఫ్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఇచ్చోడ ఎఫ్ఆర్వో పుండలిక్ తెలిపారు.

బీజేపీ నాయకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనకు దిగిన 20 మంది బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పద్మవార్ రాకేశ్, పాయల్ సాయికుమార్, మైలారం సచిన్, గౌకర్ విశాల్, అంగల్వార్ సాయిరాజ్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన షేక్ తాజ్‌మియా శుక్రవారం ఆటోలో గ్యాస్ సిలిండర్ తీసుకుని అంబేద్కర్ చౌక్‌కు వచ్చాడు. అక్కడ ఫ్లెక్సీల కోసం ఓ షాపులోకి వెళ్లాడు. ఇంతలో ఆటోలోని గ్యాస్ సిలిండర్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి



నార్నూర్: పూజలు చేస్తున్న భక్తులు



ఆదిలాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి



బోథ్: సొనాలలో రామాలయంలో..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. ఉత్తరద్వారం గుండా ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బోథ్ మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు పూజలు చేశారు. జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారు. – సాక్షి, నెట్‌వర్క్



ఉట్నూర్‌రూరల్: శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



తాంసి: పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



నేరడిగొండ: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ముమ్మరంగా జాతర నిర్వహణ పనులు



తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



స్టార్టర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఇంద్రవెల్లి: పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకొని ఈనెల 28న మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభించనున్న కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లు విషయంలో అధికారుల పనితీరుపై ‘జాతర ఏర్పాట్లు ఎప్పుడో?’ అనే శీర్షికన ఈనెల 9న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం నుంచే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మెస్రం వంశీయులు మూడు రోజుల పాటు బస చేసే మర్రిచెట్టు వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గోవడ్ వద్ద శాశ్వతంగా ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు పనులు చేయిస్తున్నారు. అదే విధంగా తాగునీటి వసతుల ఏర్పాట్లను ముమ్మరం చేశారు. జాతర నిర్వహణ స్థలం వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశల నిరసన



నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఉట్నూర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తల ఆందోళన బాట పట్టారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18 వేలు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ మాట్లాడుతూ.. ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజి మార్కులు వెంటనే నిర్ణయించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వ తమ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలోకి వెళ్లి ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు కాంత, మంగవతి, అనిత, జనాబాయి, లత, చిన్నుబాయి, సంగీత, సముద్రబాయి, లక్ష్మి, చంపాబాయి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బంజారా దీక్షభూమికి ఆధ్యాత్మిక శోభ

- గురుకృప దినోత్సవానికి ఏర్పాట్లు
- నేడు భోగ్ బండారో, మహాపూజ



ముస్తాబైన శ్రీమహాన్ తపస్వీ రామారావు మందిరం

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి(హెచ్)లోని జాతీయ బంజారా దీక్షభూమి వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దీక్షభూమి వద్ద కొలువుదీరిన జగదాంబ దేవి, సంత్ మహాన్ తపస్వి ధర్మ గురువు రామారావు మహరాజ్ మందిరాలను ముస్తాబు చేశారు. దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేమ్ సింగ్ మహరాజ్ అధ్యక్షతన ప్రతీ ఏడాది జనవరి 11న నిర్వహించే గురుకృప దినోత్సవం (దీక్ష దివస్) కార్యక్రమానికి అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. మూడు రోజులపాటు మహా జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్



భూమిపూజ చేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్నాపూర్‌లో ఆశ్రమ పాఠశాలలో రూ. 30 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, అప్క కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: జిల్లాలో మారుమూల ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నారని వారికి నాణ్యమైన విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మాడగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.30 లక్షల ఐటీడీఏ నిధులతో రెండు అదనపుగదుల నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు డైరెక్టర్ జీవీ రమణ, ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, తుల శ్రీనివాస్, సజన్, సంధ్యారాణి, మడవి ప్రకాష్, సాయన్న పాల్గొన్నారు.

తాంసి: కొలాం గిరిజన గ్రామాల్లో మల్టీపర్పస్ సెంటర్ల నిర్మాణాల ద్వారా కేంద్ర ప్రభుత్వం సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని లీంగూడ, తలమడుగు మండలంలోని కొలాంగూడ, నర్సాపూర్, సోనాపూర్ గ్రామాల్లో ఒక్కొక్క సెంటర్‌కు రూ.60 లక్షల పీఎం జన్మన్ నిధులతో నిర్మించే భవనాలను భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. బరంపూర్ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాజ్‌ఘడ్ గ్రామంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రాయితీ జొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఐటీడీఏ డీఈ సతీశ్, ఏఈ శేఖర్, తుల శ్రీనివాస్, భీంరావు, సంభు, కేదారేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

నేరడిగొండ: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని భారత జాతీయ రహదారుల అధీకృత సంస్థ సూపర్‌వైజర్ శివరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద భారత జాతీయ రహదారుల అధీకృత సంస్థ ఆధ్వర్యంలో రహదారి భద్రత నియమాలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, పదే పదే వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో ఫోన్ మాట్లాడవద్దని, మూల మలుపుల వద్ద జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, మోయిజ్, సందీప్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎస్. శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఉట్నూర్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నచిన్న తప్పిదాల వల్ల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంవీఐ మార్గం రవీందర్, ఏఎంవీఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి ఆపార్ ఐడీ అందించాలి



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోథ్: మండలంలోని కౌఠ(బి)లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ రవూఫ్, జిల్లా సెక్టోరియల్ అధికారి నారాయణలు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నమోదైన ప్రతీ విద్యార్థికి ఆపార్ ఐడి తప్పనిసరిగా ఇవ్వాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. పాఠశాలలో పనులు నిలిచిపోయిన భవనాన్ని పరిశీలించారు. నిధులు విడుదల చేసి పనులను పూర్తయ్యేలా చేస్తామన్నారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని నిరంతరం శ్రమించడం ద్వారా అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చన్నారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీ సిబ్బందికి, కూరగాయలు, బియ్యం, వంట సామాగ్రి ,వంట పాత్రలు వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళల ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలి

ఆదిలాబాద్: అనాధిగా వస్తున్న కళల ప్రాశస్త్యాన్నిప్రతిఒక్కరూ తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని శ్రీ గోపాల కృష్ణ విద్యా మందిర్‌లో మంథనం ఒక సంకల్పం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జడకొప్పులాట కార్యక్రమానికి గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథనం ఒక సంకల్పం కళ సాంస్కృతిక వేదిక ద్వారా అంతరించిపోతున్న కళలకు జీవం పోసేలా నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జడ కొప్పులాటకు ఎంతో ప్రాధాన్యం ఉండేదని, ఇలాంటి ఆటలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. నిషికాంత్ దేశ్ పాండే, అల్లూరి సంజీవ రెడ్డి, కుపాటి మనోహర్, సతీష్, శ్రీపాద, అనిరుద్, సాగర్ పాల్గొన్నారు.



ముందస్తు సంక్రాంతి వేడుకలు

సంబురాలు జరుపుకుంటున్నసోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల విద్యార్థులు

బోథ్: మండలంలోని పలు పాఠశాలల్లో ముందుస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలలో, వేదం పాఠశాలలో, సొనాలలో వివేకానంద పాఠశాలలో సంక్రాంతి సంబురాలను జరుపుకున్నారు. విద్యార్థులు హరిదాసు వేశం వేసి పాటలు పాడారు. భోగి మంటల చుట్టూ ఆడపడుచుల వేషంలో వి ద్యార్థులు పాటలు పాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో ప్రధానో పాధ్యాయులు సంగీత, పచ్చిపాల సంతోష్, కృష్ణ చైతన్య, ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

భీంపూర్ బీజేపీ అధ్యక్షుడిని మార్చాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాంసి: భీంపూర్ మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అంకం అశోక్‌ను వెంటనే మార్చాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీ గోడం నగేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నికను ఖండిస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోని నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలన్నారు. అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి నూతన అధ్యక్షుడిని మార్చాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు రాకేశ్, చంద్రకాంత్, స్వామి, రమేశ్, గంగయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక




సభ్యులను ఎన్నుకుంటున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర సీనియర్ నాయకులు కాంబ్లే బాలాజీ తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా జాదవ్ రాందాస్, ఉపాధ్యక్షుడిగా సత్యాపాల్, కార్యదర్శిగా సూరజ్, కార్యదర్శిగా విజయ్, సంయుక్త కార్యదర్శిగా కొడే కార్‌కృష్ణ, జాదవ్ వరుణ్, సునీల్, అజయ్, మనోజ్, విశాల్, తదితరులను ఎన్నుకున్నారు.

యూత్ ఫెస్టివల్‌లో కౌఠ యువకుడు

బోథ్: మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ అనే యువకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్, ఆక్టివిస్ట్ తరపున తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 19 మంది పాల్గొన్నారు. కాగా అదిలాబాద్ జిల్లా నుంచి వెండి సోమేశ్వర్‌కు పాల్గొనే అవకాశం దక్కింది.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ నరేందర్ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే బృందం శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పించారు. డయాబెటిస్‌తో కలిగే నష్టాలు, ఎలా సోకుతుందని తదితర అంశాల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తినే ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో జాదవ్ కైలాస్

ఇచ్చోడ: సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్‌పీ పూలే సుచిత్ర, నాలుగు రకాల జొన్న విత్తనాలు వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతులు సంబంధించిన క్లస్టర్ ఏఈవోలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సంజీవ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.